సాక్షి ఒడిశా

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ.5,30,642

బంగారం: 5 గ్రాముల 990 మిల్లీ గ్రాములు

వెండి: 356 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



అయ్యో పాపం..!

ప్రేమించి రహస్యంగా పెళ్లికొని గర్భవతిగా ఉన్న భార్యను భర్త బస్టాండ్‌లో వదలి వెళ్లిన విషాదకర ఘటన ఉమ్మర్‌కోట్‌లో చోటుచేసుకుంది.

- IIలో▸



పీఎం మోదీ బరంపురం పర్యటన ఖరారు

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బరంపురం పర్యటనకు ఈనెల 27న విచ్చేయనున్నారు.

- IIలో▸

న్యూస్‌రీల్

విస్తృతంగా ఎక్సైజ్ దాడులు



స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

రాయగడ: నాటుసారా అక్రమ రవాణా, తయారీపై జిల్లా యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. కలెక్టర్ అశుతోష్ కులకర్ణి ఆదేశానుసారం జిల్లా అబ్కారీ శాఖ అధికారులు చందిలి, అరబి, పిండాపదర్, తండిపూర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం విస్తృతంగా దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా 570 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, మరో 4 వేల లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. నాగావళి తీరాన నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు చేపట్టి సారా తయారీకి వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

దొంగతనం కేసులో నిందితుడు అరెస్టు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ స్వాతి

రాయగడ: ఒక దొంగతనం కేసుకు సంబంధించి టికిరి పోలీసులు నలుగురి నిందితులను శుక్రవారం అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ డీపీవో కార్యాలయంలో విలేకరుల సమావేశం శనివారం నిర్వహించారు. జిల్లాలోని టికిరి పోలీస్‌స్టేషన్ పరిధి సునాముదివీధిలో సుశాంత నాగ్ అనే వ్యక్తి నివసిస్తున్నాడు. అయితే ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో దుండగులు ఇంట్లో చొరబడి బంగారు ఆభరణాలతో పాటు రూ.1.80 లక్షల నగదును దొంగిలించారు. ఈ మేరకు బాధితుడు ఈ ఏడాది మార్చి 16వ తేదీన టికిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి కొరాపుట్ జిల్లా జయపూర్‌కు చెందిన భరత్ నాయక్, బైపరిగుడ ప్రాంతానికి చెందిన రాజు నాయక్, కేరళ వీధికి చెందిన ఎస్.వెంకటేష్, మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండకు చెందిన ఒక మైనర్ బాలుడిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి సుమారు నాలుగు తులాల బంగారు మంగళ సూత్రం, మరో నాలుగు గ్రాముల చెవిదిద్దులు, 5 సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్, బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్, ఒక ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సమావేశంలో టికిరి ఐఐసీ బిశ్వబందిని బాగ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



బోమిఖల్ ఓవర్ బ్రిడ్జిపై ప్రమాద దృశ్యం

భువనేశ్వర్: స్థానిక బోమిఖల్ స్క్వేర్‌లో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నందున పాత కటక్ మార్గం నుంచి రసూల్‌గడ్ వరకు ఉన్న అన్ని మార్గాలను మూసివేసి మరో మార్గంలో తరలిస్తున్నారు. వాహనాలు బోమిఖల్ ఓవర్ బ్రిడ్జి ద్వారా మళ్లించిన మార్గంలో 2 కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. వాహనాల రవాణా కొనసాగుతోంది. ప్రమాదం అత్యంత భయంకరంగా సంభవించిందని ప్రత్యక్ష సాక్షుల కథనం. రెండు వాహనాలు ముఖాముఖి బలంగా ఢీకొనడంతో సేఫ్టీ బెలూన్లు బయటకు వచ్చి గాలి ఊడిపోయాయి. రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న 4 మంది వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని స్థానిక క్యాపిటల్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

కోణార్క్- భువనేశ్వర్‌కు రైలు మార్గం

భువనేశ్వర్: కోణార్క్–భువనేశ్వర్ రైలుమార్గం సర్వే నిర్వహణకు రైల్వే శాఖ ఆమోదించింది. పూరీ జిల్లా నిమాపడా మరియు గోప్ మీదుగా ప్రతిపాదిత కోణార్క్, భువనేశ్వర్ రైలు మార్గానికి సమగ్ర పథకం నివేదిక (డీపీఆర్)ను సిద్ధం చేయడానికి తుది స్థాన సర్వేను ఆమోదించినట్లు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ప్రాంతీయ రైలు మార్గం అనుసంధానం బలోపేతం చేస్తుంది. యునెస్కో వారసత్వ ప్రపంచ ప్రఖ్యాత కోణార్కు సూర్య దేవాలయం ప్రాంతం అనుసంధానంతో పర్యాటకం మరియు స్థానిక ఆర్థిక వ్యవస్థను పెంపొందించి తన నియోజకవర్గ నివాసితులకు ప్రయోజనం చేకూరుస్తుందని ఉప ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.



- అవిశ్వాస తీర్మానంపై నాన్చుడు ధోరణి
- మద్దతు తెలుపాలని కోరిన కాంగ్రెస్

బీజేడీ వైఖరేంటో..?

NO-CONFIDENCE MOTION

భువనేశ్వర్: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో మోహన్ చరణ్ మాఝి నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాలనపై రాష్ట్ర ప్రజలు తీవ్ర మనస్తాపానికి గురయ్యారనే ఆరోపణలతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించింది. దీనిపై శాసనసభలో చర్చకు స్పీకర్ సురమా పాఢి అంగీకారం తెలిపారు. అయితే విపక్ష బిజూ జనతా దళ్ మాత్రం దీనిపై నాన్చుడు వైఖరి ప్రదర్శిస్తోంది. రాజకీయ సంక్లిష్ట పరిస్థితుల్లో తరచూ బిజూ జనతా దళ్ ఉభయ కాంగ్రెసు, భారతీయ జనతా పార్టీలకు సమాన దూరం పాటిస్తుందని ప్రకటించడం ఆచారంగా మారింది. పలు సందర్భాల్లో సమాన దూరం అధిగమించి బీజేపీపై మొగ్గు చూపిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. రాష్ట్రంలో తాండవిస్తున్న తాజా విపత్కర పరిస్థితుల నేపథ్యంలో ప్రధాన విపక్ష హోదాలో కొనసాగుతున్న బిజూ జనతా దళ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కాంగ్రెసు అభ్యర్థించింది. లేకుంటే తాము ప్రతిపాదించే అవిశ్వాస తీర్మానానికి మద్దతు ప్రకటించాలని కోరింది. ఈ నేపథ్యంలో శాసనసభ ప్రాంగణంలో విపక్ష కార్యాలయంలో బీజేడీ నాయకుడు ప్రతాప్ కేశరి దేవ్‌ని సంప్రదించింది. అయితే ఇంతవరకు బీజేడీ వైఖరి స్పష్టం కాలేదు.

బీజేపీ బలంపై బీజేడీ భయం

రాష్ట్ర శాసనసభలో భారతీయ జనతా పార్టీ తొలిసారిగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 147 మంది సభ్యులున్న సభలో బీజేపీకి 78 స్థానాలు, బీజేడీకి 50, కాంగ్రెస్‌కు 14, సీపీఎంకు 1, స్వతంత్రులకు 3 స్థానాల బలం కొనసాగుతోంది. విపక్ష బిజూ జనతా దళ్ సిట్టింగ్ ఎమ్మెల్యే అకాల మరణంతో ఒక స్థానం ఖాళీ అయింది. ఈ లెక్కన పాలక బీజేపీకి స్పష్టమైన సంఖ్యా గరిష్టత ఉంది. ఇదిలా ఉండగా కాంగ్రెస్ 15 మంది ఎమ్మెల్యేల మద్దతుతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించి, విపక్ష బిజూ జనతా దళ్ సాయం కోసం నిరీక్షిస్తోంది. అంతేకాకుండా కోరిన ప్రకారం సానుకూలంగా స్పందించి రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా విపక్ష పరపతిని పరిరక్షించాలని హితవు పలికింది. అయితే ప్రస్తుతం బీజేపీకి స్పష్టమైన బలం ఉండడంతో అవిశ్వాస తీరాన్మానికి అనుకూలంగా ఓటు వేసినా ప్రయోజనం ఉండదని బీజేడీ భావిస్తున్నట్లు పరోక్షంగా స్పష్టమవుతోంది. దీంతో ఇటీవల భారత ఉపరాష్ట్రపతి ఎన్నికల తరహాలో ఓటింగ్ నిష్క్రమణకు తలొగ్గితే పరోక్షంగా లాభిస్తుందనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

త్వరలో నువాపడా ఉప ఎన్నిక

బీజేడీ సిట్టింగ్ ఎమ్మెల్యే రాజేంద్ర ఢొలొకియా అకాల మరణంతో నువాపడా నియోజకవర్గంలో త్వరలో ఉప ఎన్నిక జరగనుంది. అవిశ్వాస తీర్మానానికి అనుకూలించి వైరిభావం పొందే కంటే సద్దుమణిగి సానుభూతి మద్దతుతో ఉప ఎన్నికలో సునాయాసంగా గట్టెక్కేందుకు మార్గం సుగమం చేసుకోవడం మేలు అనే భావనతో బీజేడీ శిబిరంలో అంతర్మథనం సాగుతోంది. కాంగ్రెసు కోరిన మేరకు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటు వేస్తే పదవీ కాంక్షతో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెసు ముసుగులో నవీన్ పట్నాయక్ నేతృత్వంలో బిజూ జనతా దళ్ పావులు కదిపిందనే అధికార పక్షం ఆరోపణలపై ఒకింత ఆందోళన వ్యక్తం అవుతుంది. అందువలన అధికార పక్షానికి అండగా నిలిచి, ఖాళీ అయిన నువాపడా నియోజకవర్గాన్ని మరోసారి కైవసం చేసుకుని సభలో బలం దిగజారకుండా పరిరక్షించుకోవడం ఉభయ తారకంగా ఉంటుందనే వ్యూహానికి పదును పెడుతున్నట్లు తెలుస్తోంది. తోటి విపక్షం కాంగ్రెసుకు సర్ది చెప్పి, యుక్తితో అధికార పక్షాన్ని మెప్పించి నువాపడా నియోజకవర్గం ఉప ఎన్నికని సానుకూలంగా మలచుకోవడమే ధ్యేయంగా పావులు కదుపుతున్న బీజేడీ ప్రభుత్వ వ్యతిరేక అవిశ్వాస తీర్మానంపై ఇంతవరకు గుంభనం కొనసాగిస్తోంది.

బీజేడీ అడ్డుకుంటుంది: తారా ప్రసాద్ బాహిణీపతి

విపక్ష హోదాలో బిజూ జనతా దళ్ తాము ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై మెతక వైఖరి ప్రదర్శిస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ఆరోపించారు. దీనిపై సభలో చర్చకు అవకాశం లేకుండా రైతాంగం సమస్యల ముసుగులో సభలో రభస ప్రేరేపించి కార్యకలాపాలకు గండి కొట్టించి కాంగ్రెసు దృఢ సంకల్పాన్ని నీరుగార్చుతోందని మండిపడ్డారు. సభ కార్యకలాపాలు సజావుగా కొనసాగించి చర్చలు జరగాలని కాంగ్రెసు కోరుకుంటోందని, అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగాలన్నారు. స్పీకరు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి సభను పునరుద్ధరించాలని అభ్యర్థించారు. ఈ చొరవతో ప్రజాస్వామ్యబద్ధంగా అవిశ్వాస తీర్మానంపై సభలో చర్చకు మార్గం సుగమం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సమాన దూరం పాటిస్తాం: ప్రమీలా మల్లిక్

శనివారం మూడోరోజు శాసన సభ వానాకాలం సమావేశాలు పురస్కరించుకుని కాంగ్రెసు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై విపక్ష బిజూ జనతా దళ్ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ స్పందించారు. సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చకు ఆమోదించబడితే బిజూ జనతా దళ్ తన వైఖరిని స్పష్టం చేస్తుంది. ప్రస్తుతానికి ఉభయ బీజేపీ, కాంగ్రెసు నుంచి సమాన దూరంలో ఉంటుందని మరోమారు స్పష్టం చేశారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువత

జయపురం: స్థానిక నెహ్రూనగర్‌లోని అగ్రసేన్ భవనంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ శాశ్వత సభ్యుడు గౌతమ సామంతరాయ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. రక్తదానం బృహత్తరమైనదని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శిబిరంలో మొత్తం 50 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో జయపురం పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఎస్.మనోజ్, నాయకులు మీనకేతన దాస్, మధు హియాల్, పి.బ్రహ్మాజీ, సావిత్ర బెహర, రాము బెహర, ఎ.ఈశ్వరరావు, సురభి పాణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక రైతుల కాలనీలోని జెమ్స్ మిలీనియం పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో శనివారం లయన్స్ క్లబ్ అపరాజిత విభాగానికి చెందిన సభ్యులు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వృద్ధులు పాల్గొన్నారు. పితామహల్‌లో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన వైద్య బృందం ఈ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలను నిర్వహించారు. మొత్తం 125 మందికి వైద్య పరీక్షలను నిర్వహించగా, దీనిలో 27 మందికి కాటరాక్ట్ ఆపరేషన్లు చేయాలని సూచించారు. మరో 12 మందికి అవసరమయ్యే కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అపరాజిత సంస్థ అధ్యక్షుడు జి.రామకృష్ణ, కార్యదర్శి బరాటం అవంతి, ఉపాధ్యక్షురాలు కోరాడ రజిత, కోశాధికారి పి.కల్యాణి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

టికిరిని సమితిగా గుర్తించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి పరిధి టికిరి పంచాయతీని సమితిగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ టికిరి పంచాయతీకి చెందిన వివిధ గ్రామాల ప్రతినిధులు సీఎం పేరిట ఒక వినతిపత్రాన్ని కలెక్టర్ అశుతోష్ కులకర్ణికి శనివారం సమర్పించారు. పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న కాసీపూర్ సమితిలో 24 పంచాయతీలు ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. సుమారు లక్ష మంది జనాభా కలిగిన ఈ సమితి అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందని, ఈ నేపథ్యంలో టికిరి పంచాయతీని సమితిగా గుర్తించాలని కోరారు. టికిరిని సమితిగా గుర్తిస్తే అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న డొంగాశిలి, కుచేయిపాదొరొ, పొడాపడి, బంకాంబ, శంకరడ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయన్నారు. వినతిపత్రం సమర్పించినవారిలో బీజేడీ సీనియర్ నాయకుడు బినోద్ నాయక్, మాజీ ఎమ్మెల్యే బిభీషన్ మాఝి తదితరులు ఉన్నారు.

శ్రీజగన్నాథుని మహాస్నానం

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరిన శ్రీజగన్నాథుని మూల విరాటులకు శనివారం మహాస్నానం చేయించారు. ఆలయ శుద్ధి చర్యలో భాగంగా ఈ స్నానం చేయించడం ఆచారం. ద్వితీయ భోగ మండప సేవ ముగిసిన తర్వాత సంబంధిత సేవకులు అలంకరణ కోసం వెళ్తుండగా జయ, విజయ్ ద్వారం మెట్లపై రక్తం చిమ్మి ఉన్నట్లు దృష్టికి రావడంతో మహాస్నానం చేయించారు. ఈ సందర్భంగా భక్తులకు దర్శనం తాత్కాలికంగా నిలిపి వేశారు.

మహిళ మృతదేహం లభ్యం



మహిళ మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు (ఇన్‌సెట్లో లక్ష్మీ దొలై)

భువనేశ్వర్: కేంద్రాపడా జిల్లా మహాకలపడా మండలం పరిధిలోని బెనకండ గ్రామం సమీపంలో మొసలి నదిలోకి లాక్కెళ్లిన మహిళ మృతదేహం లభించింది. శనివారం ఉదయం గ్రామస్తులు వెలికి తీశారు. శుక్రవారం బాధితురాలు నది ఒడ్డున ఉన్నప్పుడు మొసలి అకస్మాత్తుగా ఆమెపైకి దూసుకెళ్లి నీటిలోకి లాగింది. గ్రామస్తులు వెంటనే వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. కాగా శనివారం ఉదయం నదిలో ఆ మహిళ మృతదేహం కనుగొన్నారు. మృతురాలు లక్ష్మీ దొలైగా గుర్తించారు. ఈ సంఘటన ఉప్పు నీటి మొసళ్లకు ప్రసిద్ధి చెందిన భిత్తరకనికా జాతీయ ఉద్యానవనం సరిహద్దులోని గ్రామాల్లో ఆందోళన రేకెత్తించింది. ఇటువంటి విషాదాలు పునరావృతం కాకుండా అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ



అధికారులతో శిక్షణ పొందిన రైతులు

జయపురం: చేప పిల్లలను చెరువులో విడిచిపెట్టిన తర్వాత తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు నిర్వహించిన నాలుగు రోజుల శిక్షణా శిబిరం శనివారంతో ముగిసింది. స్థానిక పూల్‌బెడ గ్రామ ప్రాంతంలోని ఎంఎస్ స్వామినాథన్ పరిశోధన కేంద్ర సభాగృహంలో ఒడిశా ప్రభుత్వ రాష్ట్రీయ కృషి వికాస పథకంలో భాగమైన మత్స్య ఉత్పాదనపై శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్ర యూనిట్ డైరెక్టర్ ప్రశాంత కుమార్ పారిడ మాట్లాడుతూ కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితి, నవరంగపూర్ జిల్లా కొశాగుమడ సమితుల్లో రాష్ట్రీయ కృషి వికాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రెండు సమితుల్లోనూ 192 మంది మత్స్య రైతులకు చేప పిల్లలను అందజేశామన్నారు. చేపల చెరువులు సక్రమంగా నిర్వహించేందుకు నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జయపురం ప్రభుత్వ మత్స్య విభాగ అధికారి సింహాచల పాఢి, నవరంగపూర్ జిల్లా కొశాగుమడ మత్స్య అధికారి నిప్రభ రౌత్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జీఎస్ పండా



స్వాధీనం చేసుకున్న బాణసంచా

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ సమితి కె.సీతాపురం గ్రామంలో జి.భాస్కరరావు అనే వ్యక్తి ఇంట్లో శనివారం ఆకస్మిక దాడులు జరిపి, అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా, ఇతర మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ జ్యోతింద్ర పండా తెలిపారు. రాణిపేటలోని డీపీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అక్రమ బాణసంచా నిల్వలు కలిగి ఉన్నాడని వచ్చిన సమాచారం మేరకు కాశీనగర్ పోలీసులు ఈ దాడులు చేశారు. దాడుల్లో 50 ప్లాస్టిక్ సంచుల్లో తాటాకు పటాకులు, 2 బ్యాగుల క్రాకర్స్, మరో 3 బ్యాగుల్లో చేతి బాంబులు, 15 కిలోల ఖరా తదితర సామగ్రి స్వాధీనం చేసుకుని కాశీనగర్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. జి.భాస్కరరావు తనతో పాటు మరో ముగ్గురిని ఈ పనిలో పెట్టినట్లు వెల్లడించారు. లైసెన్సు లేకుండా అక్రమంగా బాణసంచా విక్రయిస్తున్నాడని, ఎక్స్‌ప్లోజివ్ చట్టం 1884 కింద ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించాలి



మెమోరాండం సమర్పిస్తున్న కుంద్ర సమితి సభ్యులు సర్పంచ్‌లు

జయపురం: కుంద్ర సమితి చైర్మన్‌పై తాము తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మానంపై ఈనెల 27వ తేదీలోగా నోటీసులు జారీ చేయకపోతే, 29వ తేదీ నుంచి జయపురం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరవధిక ధర్నా చేపడతామని సమితి సభ్యులు, సర్పంచ్‌లు స్పష్టం చేశారు. ఈ మేరకు సమితి వైస్ చైర్మన్ తరణీసేన్ బిశాయి నేతృత్వంలో జయపురం సబ్ కలెక్టర్‌కు శనివారం మెమోరాండం సమర్పించారు. తాము ఈ ఏడాది ఆగస్టు 8వ తేదీన కుంద్ర సమితి చైర్మన్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం చేసి సబ్ కలెక్టర్‌కు లేఖ ద్వారా తెలియజేశామని గుర్తు చేశారు. తర్వాత సబ్ కలెక్టర్ అవిశ్వాస తీర్మానంలో సంతకాలు పరిశీలించారని, అయినప్పటికీ ఓటింగ్‌పై ఇప్పటివరకు నోటీసు జారీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అత్యంత విచారకరమైన విషయమని ఆరోపించారు. ఏ కారణం లేకుండా అవిశ్వాస తీర్మానం నోటీసు జారీ చేయకపోవడం ప్రజాస్వామ్య ఉల్లంఘన అని పేర్కొన్నారు. అందువలన ఇప్పటికైనా స్పందించి ఈనెల 27లోగా ఓటింగ్ నోటీసు పంపాలని, లేకుంటే ధర్నా తప్పదని స్పష్టం చేశారు.

పిడుగుపడి మహిళ మృతి



ఆరోగ్య కేంద్రం వద్ద నళిని మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి బాపన్‌పల్లి పంచాయతీ రోడణపల్లి గ్రామంలో శనివారం పిడుగుపడి మహిళ మృతి చెందింది. గ్రామానికి చెందిన సుకి మాడితో కలిసి నళిని పునేమ్ అనే మహిళ తమ పొలంలో కలుపు తీయడం కోసం పొలానికి వెళ్లారు. అయితే కొంత సేపటికి మబ్బులు పట్టడంతో వర్షం వస్తుందని భావించి పక్కనే ఉన్న గుడిసెలోకి సుకి మాడి, ఆమె రెండేళ్ల కుమారుడు సందీప్, నళిని పునేమ్‌లు వెళ్లారు. అయితే ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో గుడిసె పక్కనే పిడుగు పడడంతో ముగ్గురుకి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వీరిని పోడియ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ నళిని(27) మృతి చెందింది. సుకీ మాడి, తన కుమారుడు చికిత్స పొందుతున్నారు. నళిని మృతితో ఆమె తండ్రి ముక్క పునేమ్ శోకసంద్రంలో మునిగిపోయారు.

క్లుప్తంగా

తల్లీబిడ్డకు ప్రాణంపోశారు



పాపకు జన్మనిచ్చిన సవర రుక్మిణి

టెక్కలి/మందస: పురిటి నొప్పులతో బాధపడుతున్న గిరిజన గర్భిణికి ప్రసవం చేసి తల్లీబిడ్డలకు 108 సిబ్బంది ప్రాణం పోశారు. మందస మండలం బంసుగాం గ్రామానికి చెందిన సవర రుక్మిణి పురిటి నొప్పులతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు రిఫర్ చేశారు. శనివారం వేకువజామున 108 వాహనంలో గర్భిణిని తరలిస్తుండగా కోటబొమ్మాళి సమీపంలో పురిటి నొప్పులు అధికం కావడంతో 108 ఈఎంటీ దేవాది శ్రీనివాసరావు, పైలట్ మూగి దుర్గారావు తదితరులు వైద్య సేవలు అందజేసి ప్రసవం చేశారు. రుక్మిణి పాపకు జన్మనిచ్చింది. అయితే పాపలో చలనం లేకపోవడంతో సీపీఆర్ చేశారు. దీంతో చిన్నారి ఊపిరితీసుకోవడం ప్రారంభించింది. అనంతరం కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. 108 సిబ్బంది చేసిన సేవలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గాలికుంటు నివారణకు చర్యలు

నరసన్నపేట: జిల్లా వ్యాప్తంగా పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పశు సంవర్ధకశాఖ జేడీ రాజగోపాల్ అన్నారు. ఉర్లాం పశువైద్య కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3.30 లక్షల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు నిర్వహించే ఈ టీకాల కార్యక్రమాన్ని రెండు రోజుల క్రితం జిల్లాలో ప్రారంభించామని, ఇప్పటి వరకూ 20 వేల పశువులకు టీకాలు వేశామన్నారు. ఆస్పత్రుల వారీగా పశువులకు టీకాలు వేస్తున్నామని చెప్పారు. ఉర్లాం పశువైద్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈయన వెంట డీడీ బి.గణపతిరావు ఉన్నారు.

జాతీయ బాడీబిల్డింగ్ పోటీలకు లక్ష్మునాయుడు



రెడ్డి లక్ష్మునాయుడును అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ అధికారులు

ఎచ్చెర్ల : జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికైన స్థానిక రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఆంగ్ల ఉపాధ్యాయుడు డాక్టర్ రెడ్డి లక్ష్మునాయుడును ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ శనివారం అభినందించారు. చండీగఢ్‌లో డిసెంబర్ 14, 15న జరిగే జాతీయ స్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు లక్ష్మునాయుడును ఆదర్శంగా తీసుకుని ఫిట్‌నెస్ సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో ముని రామకృష్ణ, అకడమిక్స్ డీన్ శివరామకృష్ణ, డాక్టర్ వాసు, గేదెల రవి, గణేష్, సాగర్, నూకేశ్వరరావు, రాకోటి శ్రీనివాసరావు, సాయిరాజు, పీఆర్‌వో మామిడి షణ్ముఖరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు పూరిళ్లు దగ్ధం



వివరాలు సేకరిస్తున్న పంచాయతీ, అగ్నిమాపక సిబ్బంది

జి.సిగడాం: జాడ గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్లు కాలిపోయాయి. గ్రామానికి చెందిన చల్లా అప్పయ్యమ్మ, చల్లా ఆదినారాయణ, పులపా నర్సింహులు కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలాయి. విలువైన సామగ్రి, తిండి గింజలు పూర్తి కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.4లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోతున్నారు. సమాచారం అందుకున్న రాజాం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పంచాయతీ కార్యదర్శి జాడ వెంకటనాయుడు, వీఆర్‌ఓ సంతోష్ కాలిపోయిన ఇళ్లను పరిశీలించారు.

తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట

గార: తెలుగుదేశం పార్టీలో అంతర్గత కలహాలు బయటపడ్డాయి. గార మండం కె.సైరిగాం పంచాయతీలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యే నిర్వహించిన సమావేశంలో ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. శనివారం శ్రీకూర్మంలోని ఓ ప్రైవేటు కల్యాణ మంటపంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో 'క్యాడర్ తో లీడర్' కార్యక్రమంలో భాగంగా ఏడు పంచాయతీల క్యాడర్‌తో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. కె.సైరిగాం పంచాయతీ కార్యకర్తల సమావేశంలో సార్వత్రిక ఎన్నికల్లో పార్టీలో ముందు నుంచి ఉన్న నాయకులు, తర్వాత చేరిన నాయకుల మధ్య మాటల యుద్ధం జరిగి ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. ఎమ్మెల్యే వారించే ప్రయత్నం చేసినా నాయకులు తగ్గకపోవడం గమనార్హం.

అయ్యో పాపం..!



అమితాతో మాట్లాడుతున్న స్వచ్ఛంద సంస్థ యువతులు

- గర్భవతిని బస్టాండ్‌లో వదిలిన భర్త
- రెండు రోజులుగా భార్య ఎదురుచూపులు

కొరాపుట్: ప్రేమించి రహస్యంగా పెళ్లికొని గర్భవతిగా ఉన్న భార్యను భర్త బస్టాండ్‌లో వదలి వెళ్లిన విషాదకర ఘటన ఉమ్మర్‌కోట్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి గిర్లిగుమ్మ పంచాయతీకి చెందిన అమితా జానీ వలస కూలీగా హైదరాబాద్ వెళ్లింది. అక్కడ నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ ప్రాంతానికి చెందిన దినేష్ జానీతో ప్రేమలో పడింది. పెద్దలకు తెలియకుండా వీరు పెళ్లి చేసుకొని కాపురం పెట్టారు. దీంతో అప్పటికే తన వద్ద ఉన్న నగదు, బంగారం అన్నీ దినేష్ చేతిలో పెట్టింది. సమయం వచ్చినప్పుడు వెళ్లి విషయం పెద్దలకు చెబుతానని దినేష్ నమ్మించాడు. ప్రస్తుతం ఆమె ఏడు నెలల గర్భిణీగా ఉంది. కాన్పు సమయం సమీపిస్తుండడం.. దసరా కోసం కూలీలు స్వస్థలాలకు బయల్దేరడం జరిగింది. దీంతో చేసేదేమీలేక దినేష్ కూడా తన భార్య అమితాతో కలిసి హైదరాబాద్ నుంచి ప్రైవేట్ బస్సులో ఉమ్మర్‌కోట్ వచ్చాడు.

వస్తానని చెప్పి మాయం

ఉమ్మర్‌కోట్ కొత్త బస్టాండ్‌కు చేరుకున్నాక బస్టాండ్‌లో భార్యని కూర్చోబెట్టి వెంటనే వస్తానని చెప్పి అర్ధరాత్రి వెళ్లిన దినేష్ రెండు రోజులుగా రాలేదు. రెండు రాత్రులు గర్భిణీ బస్టాండ్‌లో ఒంటరిగా ఉండడం చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ఎంత అడిగినా జరిగిన విషయం చెప్పలేదు. దీంతో ఉన్నతాధికారులు రంగంలోకి దిగి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను పంపించారు. సంస్థ మహిళలు నచ్చజెప్పితే భర్త తనని వదలి వెళ్లాడని, తిరిగి వస్తాడని నమ్మకంగా చెప్పింది. దీంతో సంస్థ మహిళలు తమతో ఆశ్రయ కేంద్రానికి రావాలని సూచించారు. ఆమె స్పందిస్తూ తన భర్త వస్తాడని.. తాను లేకపోతే ఏమైపోతాడో అని దిక్కులు చూస్తూ విలపించింది. గత రెండు రోజులుగా ఆహారం తీసుకోకపోవడంతో కడుపులో బిడ్డకి అనారోగ్యం వస్తుందని సంస్థ మహిళలు నచ్చజెప్పారు. తమ సభ్యులు ఇక్కడే ఉంటారని.. ఆమె భర్త వస్తే ఆశ్రయ కేంద్రానికి తీసుకొస్తారని తెలియజేశారు. దీంతో అమితా వారితో నబరంగ్‌పూర్‌లోని స్వచ్ఛంద సంస్థ అశ్రయ కేంద్రానికి శనివారం సాయంత్రం వెళ్లింది. ఈ ఘటన జరుగుతున్నప్పుడు ఆ ప్రాంతంలో స్థానికులకు కంటతడి పెట్టారు.

పర్యాటకుడిని కాపాడిన లైఫ్ గార్డులు



లైఫ్‌గార్డులు రక్షించిన పర్యాటకుడు



పర్యాటకుడిని ఒడ్డుకు చేర్చుతున్న లైఫ్‌గార్డులు

భువనేశ్వర్: పూరీ సముద్రంలో మునిగిపోతున్న పర్యాటకుడిని తీరంలో పహరా కాస్తున్న లైఫ్‌గార్డ్‌లు రక్షించారు. సముద్రంలో స్నానం చేస్తుండగా కెరటాలు ఉప్పొంగడంతో కొట్టుకుపోయాడు. కెరటాల్లో కొట్టుకుపోయి ప్రాణాలతో ఒడ్డుకుచేరిన మృత్యుంజయుడు పశ్చిమ బెంగాల్‌లోని నార్త్ 24 పరగణాల ప్రాంతీయుడుగా గుర్తించారు. హోటల్ సోనాలి ఎదురుగా ఉన్న సెక్టార్ 3 సాగర తీరంలో శనివారం ఈ సంఘటన చోటు చేసుకుంది.

శాసనసభ రేపటికి వాయిదా

భువనేశ్వర్: శాసనసభ వర్షాకాలం మూడోరోజు సమావేశాలు సజావుగా సాగలేదు. స్వల్ప నిడివితో వాయిదా పడ్డాయి. రాష్ట్రంలో ఎరువుల సంక్షోభంపై విపక్ష బిజూ జనతా దళ్ (బీజేడీ) ఎమ్మెల్యేలు సభలో రేపిన దుమారంతో ఈ పరిస్థితి నెలకొంది. సభలో పలు కీలక అంశాలపై చర్చ సజావుగా నిర్వహించేందుకు స్పీకర్ సురమా పాఢి చేసిన ప్రయత్నాలు నీరు గారాయి. సభ మధ్యలో పోస్టర్లు ప్రదర్శించి బీజేడీ సభ్యులు నిరసన తెలిపారు. ప్రశ్నోత్తరాలు ఆరంభం నుంచి సభలో అనిశ్చితి తాండవించింది. పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు వరుసగా 2సార్లు సమావేశాల్ని వాయిదా వేశారు. తొలుత సాయంత్రం 4 గంటల వరకు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు స్పీకర్ ప్రకటించారు. ఆ సమయానికి విపక్ష బీజేడీ సభ్యుల నిరసన సద్దుమణగలేదు. సభ పునః ప్రారంభం కాగానే యధాతథంగా విజృంభించడంతో అనివార్య పరిస్థితుల్లో స్పీకర్ సభను ఈనెల 22 ఉదయం 10 గంటలకు వరకు నిరవధికంగా వాయిదా వేసినట్లు ప్రకటించారు.

మూడు రోజులు సాదాసీదాగా

17వ శాసనసభ నాల్గో సమావేశం ఈనెల 18న ప్రారంభమై 25 వరకు జరగనున్న వర్షాకాల సమావేశాల్లో 7 పని దినాలు ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఈనెల 19న ప్రైవేట్ సభ్యులకు మాత్రమే కేటాయించి మిగిలిన 6 రోజులు అధికారిక పని దినాలుగా సభా కార్యక్రమాలు ఖరారు చేశారు. వాటిలో 3 రోజులు అర్ధాంతరంగా ముగిశాయి. తొలిరోజు సమావేశాలు దివంగత సభ్యులు, పోలీసు జవాన్లకు సంతాపం ప్రకటించడంతో ముగించారు. మర్నాడు శుక్రవారం సభా కార్యకలాపాలు రెండు విడతల వాయిదాతో నామమాత్రంగా 8 నిమిషాలు మాత్రమే జరిగాయి. తొలుత సాయంత్రం 4 గంటల వరకు తర్వాత, శనివారం ఉదయం 10 గంటల వరకు స్పీకరు వాయిదా వేశారు. శనివారం ఉదయం సభలో అదే పరిస్థితి పునరావృతం అయింది. విపక్ష సభ్యుల నిరసన నినాదాల మధ్య కొన్ని నిమిషాలు మాత్రమే ప్రశ్నోత్తరాల ఘట్టం కొనసాగింది. స్పీకరు అభ్యర్థనల మధ్య అతి కష్టం మీద 15 నిమిషాలు మాత్రమే సభా కార్యకలాపాలు కొనసాగాయి.

అంత్యోదయ కార్డులో అక్రమాలు

- గిరిజనుడి రేషన్‌కార్డులో చేరి బియ్యం బుక్కేస్తున్న తెలుగుదేశం నేత
- లబోదిబోమంటున్న బాధితుడు



మోసపోయిన గిరిజనుడు సవర మన్మధరావు



ఇటీవల వచ్చిన స్మార్ట్ రైస్‌కార్డు

నందిగాం: తెలుగుదేశం నాయకులు చేస్తున్న అక్రమాలు రోజుకొకటి బయటకు వస్తున్నాయి. నిరుపేదలకు ఇచ్చే అంత్యోదయ రేషన్ కార్డులో అక్రమంగా తన పేరు చేర్చి ఆ కార్డుకు వచ్చే బియ్యాన్ని బుక్కేస్తున్న తెలుగుదేశం నాయకుడి లీలలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. నందిగాం మండలం హర్షబడ పంచాయతీ ముకుందాపురం గ్రామానికి చెందిన సవర మన్మధరావు అనే గిరిజనుడికి వైఏపీ 013064000173 నంబర్‌తో నిరుపేదలకు ఇచ్చే అంత్యోదయ రేషన్ కార్డు, 2801209354 నంబరుతో రైస్ కార్డు ఉండేది. దీని ద్వారా ప్రతి నెలా అందే 35 కిలోల బియ్యంతో కుటుంబం నెట్టుకొచ్చేది. 2017లో మన్మధరావు ఉపాధి కోసం చెన్నై వలస వెళ్లి అక్కడ నాలుగు నెలలు పని చేసి మరలా గ్రామానికి వచ్చాడు. రేషన్ కోసం డీలర్‌ను సంప్రదిస్తే కార్డు పరిధి మారిపోయిందని చెప్పడంతో బడగాం డీలర్‌ను సంప్రదించాడు. ఆ నంబరు కార్డులో బడగాం పంచాయతీ గనియాపేటకు చెందిన తెలుగుదేశం నాయకుడు గరుడాచలం తులసీదాస్ చేరి ఉన్నాడనే విషయం తెలిసింది. దీంతో తులసీదాస్ ఇంటికి వెళ్లి అంత్యోదయ కార్డులో తన ప్రమేయం లేకుండా చేరడం, డిపో మార్చడంపై నిలదీశాడు. అంతా నా ఇష్టమని, దిక్కున్న చోట చెప్పుకో అంటూ మన్మధరావును వెళ్లగొట్టాడు. ఎన్నిసార్లు అడుగుతున్నా కార్డు ఇవ్వకుండా బెదిరిస్తుండటంతో శనివారం నందిగాం డిప్యూటీ తహసీల్దారు శంకరరావుకు ఫిర్యాదు చేశాడు. పరిశీలించి న్యాయం చేస్తామని డీటీ హామీ ఇచ్చారు. కాగా, ఇటీవల ప్రభుత్వం పంపిణీ చేసిన స్మార్ట్ రైస్ కార్డులో కుటుంబపెద్దగా గరుడాచలం తులసీదాస్ ఉంటూ కుటుంబ సభ్యునిగా సవర మన్మధరావు పేరు ఉండటం గమనార్హం.

పాత నేరస్థులపై నిఘా

శ్రీకాకుళం క్రైమ్ : హోంగార్డు స్థాయి నుంచి డీఎస్పీ వరకు తప్పనిసరిగా గ్రామాలను సందర్శించి తగాదాలకు దారి తీసే పరిస్థితులపై దృష్టి పెట్టి కారణమైన వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలని, పాత నేరస్థులపై నిరంతర నిఘా పెట్టాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రేవ్ కేసులు, మహిళలపై దాడులు, ఈవ్ టీజింగ్, పోక్సో, హెరాస్మెంట్, బాల్య వివాహాలు, సైబర్ నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. అదనపు ఎస్పీ కె.వి.రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బంగారం వ్యాపారంపై నిఘా

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో బంగారం వ్యాపారంపై నిఘా ఉంచామని, ఇప్పటికే సంబంధిత విభాగాలను సమన్వయం చేసుకుని ప్రణాళిక రూపొందించామని, అవకతవకలపై ఫిర్యాదులొస్తే దాడులు చేయడానికి వెనుకాడబోమని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో సంచలనం కలిగించిన నరసన్నపేట బంగారం వ్యాపారి హత్యోదంతంపై పై విధంగా స్పందించారు. జీఎస్టీ బిల్లులు ఎగ్గొట్టి వ్యాపారం చేయడం, లాభం వచ్చేటప్పుడు తమతో పాటు కష్టపడేవారిని దూరంగా పెట్టడం, నమ్ముకున్న వ్యక్తులే పగపెంచుకోవడంతో హత్యలకు దారి తీస్తున్నాయన్నారు. ఈ-సిమ్ స్కామ్, డిజిటల్ అరెస్టు, పార్ట్‌టైం ఫ్రాడ్ వంటి సైబర్ నేరాలు జరుగుతున్న మాట వాస్తవమేనని, ఫిర్యాదులివ్వడానికి ప్రజలు ముందుకు రావడం లేదని, అప్రమత్తతతోనే నేరాలు తిప్పికొట్టవచ్చన్నారు.

ప్రశ్నోత్తరాలకు గండి

- విపక్షాల ఆందోళనతో ఇబ్బందులు

భువనేశ్వర్: శాసనసభ వర్షాకాలం సమావేశాలు పురస్కరించుకుని జరగాల్సిన ప్రశ్నోత్తరాల సమయం నిరవధికంగా గండి పడుతోంది. విపక్షాల ఆందోళనలతో విపరీతంగా ప్రభావితం అవుతుంది. ముందస్తు కార్యక్రమం ప్రకారం శనివారం జరిగిన మూడో రోజు సమావేశాల్లో మహిళలు మరియు శిశు అభివృద్ధి, పనులు, పర్యాటకం, అబ్కారీ, మిషన్ శక్తి మరియు న్యాయ విభాగాలపై ప్రశ్నోత్తరాలు జరగాల్సింది. అయితే సభ నిరంతరం వాయిదా పడడంతో లిఖిత పూర్వక జవాబులతో ఈ ఘట్టాన్ని లాంచనంగా ముగించారు.

భువనేశ్వర్‌లో సుభద్ర శక్తి బజార్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలో సుభద్ర శక్తి బజార్‌ను ఏర్పాటు చేస్తుంది. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయ సౌలభ్యం కోసం సుభద్ర శక్తి బజారు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మహిళ శిశు అభివృద్ధి విభాగం బాధ్యతలు వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా సభలో తెలిపారు. ఈ సందర్భంగా 2024-25లో స్వయం సహాయక సంఘాలు రూ.17,454 కోట్ల రుణాలు పొందాయని తెలిపారు. సుభద్ర దరఖాస్తుదారుల మొత్తం సంఖ్య 1 కోటి 9 లక్షల 87 వేలు కాగా, మూడో విడత నుంచి 3,99,352 మందిని, రెండవ విడత నుంచి 1,83,785 మందిని మినహాయించారని బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో 156 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. ఈ కేసుల విచారణ కొనసాగుతోంది. గత ఏడాది ఎవరూ దోషులుగా నిర్ధారించ బడలేదని విపక్ష బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే ప్రశ్నకు రాష్ట్ర అబ్కారీ, న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అలాగే త్వరలో పూరీ శ్రీమందిరంలో వరుస దర్శనం వ్యవస్థ అమలు అవుతుంది. ఈ మేరకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ కానున్నాయి. దీనికి శ్రీ మందిరం పాలక మండలి కమిటీ ఆమోదం తెలిపింది. పూరీ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉప సంఘం కోసం ప్రతిపాదించినట్లు న్యాయశాఖ మంత్రి తెలిపారు.

పీఎం మోదీ బరంపురం పర్యటన ఖరారు



సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న సీఎం మోహన్‌చరణ్

భువనేశ్వర్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. ఈసారి ఆయన బరంపురం సందర్శిస్తారు. 2024 ఎన్నికల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి విచ్చేయడం ఇది ఆరోసారి. ఈ పర్యటన ఈనెల 27వ తేదీకి ఖరారు అయింది. ఈ సందర్భంగా సన్నాహక చర్యలను ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రత్యక్షంగా సమీక్షించారు. స్థానిక లోక్ సేవా భవన్‌లో ముఖ్యమంత్రి అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి, అభివృద్ధి కమిషనర్ తదితర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పలు ప్రాజెక్టులు ప్రారంభం

బరంపురం రొంగైలుండాలో జరగనున్న జాతీయ స్థాయి సేవా పర్వ్ కార్యక్రమానికి ప్రధానమంత్రి హాజరవుతారు. ఈ సందర్భంగా అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. ప్రధానమంత్రి పర్యటన కోసం లోటు లేకుండా ఏర్పాట్లు ఉండేలా చూసుకోవాలని సీఎం మోహన్‌చరణ్ మాఝీ సీనియర్ అధికారులు మరియు విభాగ కార్యదర్శులకు వివరణాత్మక సూచనలు జారీ చేశారు. భద్రతా చర్యలు, జన సందోహం నిర్వహణ, పర్యటన లాజిస్టిక్స్, వేదిక, ఆరోగ్య సౌకర్యాలు, నీరు మరియు విద్యుత్ నిరంతర సరఫరా, రాష్ట్ర మరియు కేంద్ర సంస్థల మధ్య సమన్వయంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి సామర్థ్యాన్ని జాతీయ వేదికపై ప్రదర్శించడం యొక్క ప్రాముఖ్యతను అధికారులకు వివరించారు.

మాజీ ఎమ్మెల్యే జార్జ్ తిర్కీ కన్నుమూత



జార్జ్ తిర్కీ



నివాళులర్పిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝి తదితరులు

భువనేశ్వర్: మాజీ ఎమ్మెల్యే, గిరిజన నాయకుడు జార్జ్ తిర్కీ (67) కన్నుమూశారు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆయన అంత్యక్రియలు పూర్వీకుల గ్రామం ఝుమూర్‌లో నిర్వహించారు. సుందర్‌గఢ్ ప్రాంతంలో బలమైన గిరిజన నాయకుడుగా జార్జ్ తిర్కీ పేరొందారు. జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) నుంచి 2 సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి స్వతంత్ర అభ్యర్థిగా, మరోసారి సమత క్రాంతి దళ్ తరపున శాసన సభకు ఎన్నికయ్యారు. ఒడిశా శాసనసభకు 4 సార్లు ఎన్నికై బీరమిత్రపూర్ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించారు. 1995, 2000, 2009 మరియు 2014లో జరిగిన ఎన్నికల్లో వరుసగా 11వ, 12వ, 14వ మరియు 15వ ఒడిశా శాసన సభకు బీరమిత్రపూర్ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. ఆయన మృతిపై గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తదితరులు సంతాపం తెలిపారు. జార్జ్ తిర్కీ పార్థివ దేహాన్ని రాష్ట్ర శాసనసభ మీదుగా పూర్వీకుల గ్రామానికి తరలించారు. ఈ సందర్భంగా శాసన సభ ముంగిట స్పీకర్, ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు తదితరులు నివాళులర్పించారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న గవర్నర్ హరిబాబు

భువనేశ్వర్: క్షయవ్యాధి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి అన్నారు. ఈ మేరకు వారిని ఆదుకోవడానికి చర్యలు ప్రారంభించారు. దీనిలో భాగంగా శనివారం రాజ్ భవన్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఖుర్దా జిల్లాలోని 100 మంది క్షయ రోగులకు అందించాలని కోరుతూ కలెక్టర్ అమృత్ రుతురాజ్‌కు పౌష్టికాహార కిట్లు అందజేశారు. ఈ చొరవ ప్రధానమంత్రి క్షయ విముక్త భారత్ అభియాన్‌లో భాగంగా పేర్కొన్నారు. జిల్లాలోని క్షయ రోగులకు చికిత్స సమయంలో స్థిరమైన పోషకాహార సహాయాన్ని అందించడానికి నిక్షయ్ మిత్రగా గవర్నర్ దత్తత తీసుకున్నారు. క్షయ-ముక్తి ఒడిశాను సాధించే సమష్టి లక్ష్య సాధనలో భాగంగా సమాజంలోని అత్యంత దుర్బల వర్గాలకు మద్దతు ఇచ్చేందుకు విశ్వవిద్యాలయాలు, కార్పొరేట్లు మరియు దాతలు నిక్షయ్ మిత్రలుగా ముందుకు రావాలని కోరుతూ లేఖ రాస్తానని ప్రకటించారు. పోషకాహార కిట్లు అందించిన చొరవ రోగుల ఆరోగ్యాన్ని బలోపేతం చేయడమే కాకుండా, క్షయని కొత్త నిబద్ధతతో ఎదుర్కోవడానికి సమాజంలో సమష్టి బాధ్యతను ప్రేరేపిస్తుందని ఆరోగ్య - కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, కార్యదర్శి అశ్వతి అన్నారు. కార్యక్రమానికి పలువురు సీనియర్ అధికారులు హాజరయ్యారు.

బకాయిల భారం భరించలేం!



ప్రైవేటు డిగ్రీ కళాశాలలో విద్యార్థులు

- రేపటి నుంచి మూతపడనున్న ప్రైవేటు డిగ్రీ కాలేజీలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వ తీరుకు నిరసనగా తరగతుల బంద్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సోమవారం నుంచి ప్రైవేటు డిగ్రీ కళాశాలలు మూతపడనున్నాయి. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే పాఠశాల విద్యను గాలికొదిలేసింది. ఇంటర్మీడియెట్ విద్యను పెద్దగా పట్టించుకున్నదాఖలాలు కనిపించడంలేదు. ఇక డిగ్రీ కాలేజీ విద్యపై ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. మొన్నటి వరకు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్‌ను సైతం వెలువరించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. ఇక 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఐటీఐ, పాలిటెక్నిక్ ఇతర వృత్తివిద్య కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదు. గత 16 నెలలుగా సీఎంను, డిప్యూటీ సీఎం, విద్యాశాఖామంత్రులను పలుమార్లు కలిసినా అతీగతీ లేదని సంఘ నాయకులు వాపోతున్నారు.

రూ.80 కోట్లు పెండింగ్..

జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో 100 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వీటిలో 16 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు మినహా మిగిలిన 84 ప్రైవేటు కాలేజీలే. వీటిల్లో ఫంక్షనింగ్ జరుగుతూ.. అడ్మిషన్లు జరుపుతున్న కాలేజీలు 76 వరకు ఉన్నాయి. వీటిలో 30 వేలు మంది వరకు చదువుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు 2024-25 విద్యా సంవత్సరానికి గాను అకడమిక్ ఇయర్ బ్యాచ్‌కు రూ.45 కోట్లు, అంతకుముందు మూడు క్వార్టర్ల పెండింగ్ మరో రూ.35 కోట్లు కలిపి రూ.80 కోట్ల మేర ఒక్క డిగ్రీ విద్యకే పెండింగ్ ఉన్నట్లు ఏపీ ప్రైవేటు డిగ్రీ కాలేజీల మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు.

నిర్వహణ భారం భరించలేక..

విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయలేక, ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాక కాలేజీల నిర్వహణ భారంగా మారింది. భవనం అద్దెలు, అధ్యాపకుల జీతాలు, కరెంట్‌బిల్లులు, అఫ్లియేషన్ ఫీజులు, కళాశాలల రోజువారి నిర్వహణ తలకు మించిన భారంగా మారడంతో ప్రైవేటు కాలేజీల మేనేజ్‌మెంట్లు తీవ్ర ఒత్తిడిలో ఉన్నాయి. దీంతో రాష్ట్రంలోని ఏపీ ప్రైవేట్ డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులను భయపెట్టి, బాధపెట్టి సాధించిందేమీలేదని భావించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రభుత్వం స్పందించే వరకు కాలేజీల్లో తరగతులు రద్దు చేయాలని నిర్ణయించింది. ఈనెల 14న రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో తీసుకున్న ఏకగ్రీవ తీర్మానం మేరకు ఈ నెల 22 నుంచి ప్రైవేటు డిగ్రీ కాలేజీలు మూడపడనున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పరిధిలో శ్రీకాకుళం జిల్లాలోని అన్ని ప్రైవేటు డిగ్రీ కాలేజీలను మూసివేస్తామని సంఘ నాయకులు స్పష్టంచేస్తున్నారు.

నిధులు విడుదల చేయాలి..



ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ నిధుల విషయమై ప్రభుత్వ పెద్దలు, ప్రజాప్రతినిధులను ఎన్నిసార్లు కలిసిన ఉపయోగం లేకపోయింది. విద్యార్థులను ఫీజులు చెల్లించమని ఒత్తిడి చేయలేక, ప్రభుత్వం నిధులు విదల్చక కాలేజీల నిర్వహణభారం కష్టంగా మారింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో రాష్ట్రంతోపాటు శ్రీకాకుళం జిల్లాలోను ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో క్లాసులను నిర్వహించకూడదని నిర్ణయించాం. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని బకాయి నిధులు విడుదలకు చర్యలు తీసుకోవాలి.

– పొన్నాన జయరాం, ఏపీ ప్రైవేటు డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

క్లుప్తంగా

సీఐని సస్పెండ్ చేయాలని ఆందోళన



ఎస్.కోట సీఐని సస్పెండ్ చేయాలని ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట : జిందాల్‌కు కొమ్ము కాస్తూ నిర్వాసితుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న సీఐని సస్పెండ్ చేయాలంటూ జిందాల్ నిర్వాసితులు శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిందాల్‌కు అమ్ముడుపోయిన సీఐ గిరిజన నేతలను ఇబ్బందులు పెట్టటమే కాక, వారి ఇళ్లకు కానిస్టేబుళ్లను పంపి, వేధిస్తున్నారన్నారు. ఇటీవల సత్యనారాయణ రాజు, అప్పలనాయుడులను వేధించటమే కాక, రెండు రోజులు స్టేషన్‌లో ఉంచి, బెదిరింపులకు గురి చేశారని ఆరోపించారు. సీఐ అవినీతి, అక్రమాలను త్వరలోనే బయటపెడతామని పేర్కొన్నారు.

జిందాల్ శిబిరంలో మహిళకు అస్వస్థత



చికిత్స పొందుతున్న శిరగం లక్ష్మి

శృంగవరపుకోట: బొడ్డవరలో జిందాల్ నిర్వాసిత శిబిరంలో నిరసన దీక్షలు చేస్తున్న నిర్వాసితుల్లో అమ్మపాలెం గ్రామానికి చెందిన శిరగం లక్ష్మి శనివారం అకస్మాత్తుగా అస్వస్థతకు గురైంది. దీంతో ఆమెను హుటాహుటిన ఎస్.కోట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసి, జిల్లా కేంద్రంలో ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. వైద్యులు సకాలంలో స్పందించటంతో ప్రాణాపాయం తప్పిందని, ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని స్థానికులు తెలిపారు.

దేవుపల్లిలో అక్రమంగా చెట్ల నరికివేత



దేవుపల్లిలో సాగులో ఉన్న మామిడి చెట్లను అక్రమంగా నరికేసిన దృశ్యం

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో కొండవానిపాలెం గ్రామానికి అనుకొని సాగులో ఉన్న మామిడితోటలోని చెట్లు నరికి వేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. సర్వే నంబరు 322లోని 6లో పది ఎకరాలు జిరాయితీ పట్టా భూమి ముదునూరు సన్యాసిరాజు, చేకూరి సూర్యకుమారి సాగులో ఉన్న మామిడి చెట్లను శనివారం కొందరు అక్రమంగా నరికేశారు. దీంతో సంబంధిత రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మహేష్‌కు ఫిర్యాదు చేశారు. విశాఖపట్నంలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన పైల నటరాజు తమ పొలంలో ఉన్న మామిడి చెట్లను నరికేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు కూడా ఫిర్యాదుదారులు తెలిపారు. ఈ విషయమై ఎస్‌ఐను వివరణ కోరగా మామిడి చెట్ల నరికివేతపై ఫిర్యాదు అందిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇదే విషయమై తహసీల్దార్ డోలా రాజేశ్వరరావును వివరణ కోరగా తమ దృష్టికి ఈ విషయం రాలేదని వస్తే పరిశీలిస్తామని పేర్కొన్నారు.

వట్టిగెడ్డలో పడి వ్యక్తి మృతి



గేదెల శ్రీనివాసరావు మృతదేహం

వీరఘట్టం: మండలంలోని నడుకూరు గ్రామానికి చెందిన గేదెల శ్రీనివాసరావు(49) స్థానిక వట్టిగెడ్డలో పడి మృతి చెందాడు. మృతుని కుమారుడు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ జి.కళాధర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. వీరఘట్టం గుండా ప్రవహిస్తున్న వట్టిగెడ్డలో బ్రిడ్జికి దిగువ భాగంలో ఓ మృతదేహం ఉన్నట్టు శనివారం ఉదయం స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో ఎస్.ఐ తమ సిబ్బందితో వచ్చి గుర్తు తెలియని మృతదేహం కింద నిర్ధారించి ఒడ్డుకు తీసుకువచ్చారు. మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతుని ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ వ్యక్తి ఎవరికైనా తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. నడుకూరుకు చెందిన కొందరు వ్యక్తులు మృతుని గుర్తించారు. ఇతడు నడుకూరుకు చెందిన గేదెల శ్రీనివాసరావు అని పోలీసులకు తెలియజేశారు. అనంతరం మృతుని కుమారుడు పాలకొండ ఏరియా ఆసుపత్రికి వెళ్లి అక్కడ ఉన్న మృతదేహాన్ని చూసి, చనిపోయినది తన తండ్రే అని పోలీసులకు తెలిపారు. శుక్రవారం సాయంత్రం గెడ్డకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు గెడ్డలో పడిపోయినట్టు నిర్ధారించారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

వేగుచుక్క.. గురజాడ

- నాటికి.. నేటికీ అజరామరం కన్యాశుల్కం
- నేడు మహాకవి 163వ జయంతి



గురజాడ వేంకట అప్పారావు



గురజాడ స్వగృహం

విజయనగరం టౌన్: విజయనగర ఖ్యాతిని దశ దిశలా చాటిన మహానుభావులు ఎందరో ఉన్నారు. విద్యలనగరమైన విజయనగరంలో సాహితీ సౌరభాలను కురిపించారు. ఆధునిక ఆంధ్ర సాహిత్యంలో వేగుచుక్కలా మెరిసారు. వందల ఏళ్లు దాటినా ఆ సాహితీవేత్తలు అజరామరులే. అటువంటి సాహితీవేత్తలు నడయాడిన నేలపై మనం జన్మించడం మనందరి అదృష్టం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గురజాడ 163వ జయంతి ఉత్సవాన్ని ఆదివారం అధికారికంగా నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మహాకవి స్వగృహంలో ఉన్న చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన, 9.15 గంటలకు గురజాడ స్వగృహంలో ఉన్న విగ్రహానికి ప్రముఖులతో పూల మాలాలంకరణ చేస్తారు. 9.30 గంటలకు గురజాడ స్వగృహం నుంచి గురజాడ కూడలి వద్ద ఉన్న గురజాడ కాంస్య విగ్రహం వరకూ ఊరేగింపు ఉంటుంది. అనంతరం 9.45 గంటలకు ప్రముఖులతో పూల మాలాలంకరణ ఉంటుంది. దేశమంటే మట్టికాదోయ్,... సామూహిక దేశభక్తి గీతాలాపన నిర్వహిస్తారు. 10 గంటలకు ప్రముఖుల సందేశాలు, 10.30 గంటలకు వందన సమర్పణ చేయనున్నారు.

మహాకవి గురించి...

సామాజిక సమస్యలపై సాహితీ సమరం పూరించి, విశ్వ సాహితీ వినీలాకాశంలో తెలుగు వెలుగులు విరజిమ్మిన సాహితీ సౌరభం మన మహాకవి గురజాడ వేంకట అప్పారావు. గురజాడ 1862 సెప్టెంబరు 21న రాయవరంలో జన్మించారు. మన మహారాజా విద్యా సంస్థల్లో గిడుగు సహ విద్యార్థిగా మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. తన 23వ ఏట అప్పలనరసమ్మతో వివాహం జరిగింది. ఆయనకు వెంకట రామదాసు, కొండయమ్మలు సంతానం. గురజాడ సమాజంలో రుగ్మతలను రూపు మాపేందుకు కన్యాశుల్కం పేరుతో 1892 ఆగస్టు 13న తొలికూర్పును ప్రదర్శించారు. 1897లో ఆనందగజపతికి అంకితం ఇచ్చారు. రెండో కూర్పును 1909లో ప్రచురించారు. అప్పట్లో సంస్కృత భాషకు ఆదరణ ఎక్కువగా ఉండేది. ముత్యాలసరాలు రచించి సామాన్యునికి అర్థమయ్యే విధంగా రచనలు చేశారు. 1883లో సారంగధర, డామిట్ కథ అడ్డం తిరిగింది, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, లవణరాజు కల, నీలగిరి పాటలు, కాసులు, బిల్హణీయం, కన్యక, సుభద్ర, దించు, లంగరు తదితర ఎన్నో అద్భుతమైన రచనలు చేశారు. అన్నింటి కన్నా ఎవరూ రాయలేని దేశభక్తి గేయాన్ని ఆయన 'దేశమును ప్రేమించుమన్నా..' అంటూ రాసి విమర్శకుల ప్రశంసలు పొందారు. రాజా వారి కోర్టు దావాలలో ఎడతెరిపి లేకుండా ఆ భారాన్నంతా తన భుజాన్ని వేసుకుని పనులు చేశారు. అప్పటికే ఆయన ఆరోగ్యం బాగా క్షీణించింది. 1915 నవంబరు 30న ఉదయం 8.20 గంటలకు ఆ మహనీయుడు కన్ను మూశారు.

అందరి సహకారంతో గంజాయిపై ఉక్కుపాదం మోపాం

- వీడ్కోలు సభలో ఎస్పీ వకుల్ జిందల్



ఎస్పీ వకుల్ జిందల్‌కు వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

విజయనగరం క్రైమ్ : ప్రతీ ఒక్కరి సహకారంతోనే గంజాయిపై ఉక్కు పాదం మోపామని గుంటూరు జిల్లాకు బదిలీ అయిన ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. విజయనగరం పోలీసు బ్యారెక్స్‌లో ఎస్పీ వకుల్ జిందల్ వీడ్కోలు కార్యక్రమం పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు, సివిల్ పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేశామన్నారు. జిల్లా ప్రజలు, అధికారులు, సిబ్బందిని విడిచి వెళ్లడం బాధగా ఉందన్నారు. జిల్లాలో గంజాయి మూలాలను సమూలంగా నాశనం చేశామని, గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి, వారి ఆస్తులను కూడా అటాచ్ చేశామన్నారు. బాలలపై జరిగే అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై నమోదైన కేసుల్లో నిందితులకు ఆరు మాసాల్లోనే శిక్షలు పడే విధంగా చర్యలు చేపట్టామన్నారు. సైబర్ నేరాల కట్టడికి సమర్థవంతంగా పని చేశామన్నారు. తన విధి నిర్వహణలో అందించిన సహకారం మరువలేనన్నారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందల్‌ను దుశ్శాలువతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. అనంతరం ఎస్పీ జిందల్‌ను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు పి.సౌమ్యలత, జి.నాగేశ్వరరావు, డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఎం.వీరకుమార్, పలువురు రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, సీఐలు, ఆర్ ఎస్‌ఐలు, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

7న చలో విజయవాడ

- మహాధర్నాకు తరలిరండి
- ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పాలతేరు శ్రీనివాసరావు పిలుపు



మలిచర్ల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

విజయనగరం అర్బన్: రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు అక్టోబర్ 7న విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాకు జిల్లా నుంచి ఉపాధ్యాయులు తరలి రావాలని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ పాలతేరు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మలిచర్ల క్లస్టర్ కాంప్లెక్స్‌లో శనివారం జరిగిన కార్యక్రమం అనంతరం ఆయన మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అందరూ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రతి ఒక్కరూ చెట్లను దత్తత తీసుకోవాలి

- టెర్రస్ గార్డెన్‌ను ప్రోత్సహించండి
- కలెక్టర్ ఎస్.రామసుందరరెడ్డి



నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా రింగురోడ్డు మున్సిపల్ పార్కులో మొక్కను నాటి నీరు పోస్తున్న కలెక్టర్ రామసుందరరెడ్డి

విజయనగరం: ప్రతి ఒక్కరూ చెట్లను పెంచి దత్తత తీసుకోవాలని, వీలు కాని పక్షంలో టెర్రస్ గార్డెన్‌ను ప్రోత్సహించాలని కలెక్టర్ ఎస్.రామసుందరరెడ్డి సూచించారు. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రింగ్ రోడ్డు వద్ద మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చెట్ల సంరక్షణలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌లు, పాఠశాలలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చెట్లు నరికివేయడం వలన పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని, పచ్చదనం పెంపొందించకపోతే భవిష్యత్తు తరాలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. మొక్కలు నాటడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని కలెక్టర్ తెలిపారు. క్వాలిటీ లైఫ్ కోసం మొక్కలు అనివార్యం అని ఆయన వివరించారు. స్థలం లేని ప్రాంతాలలో టెర్రస్ గార్డెనింగ్‌ను ప్రోత్సహించాలని సూచించారు. టెర్రస్ గార్డెన్ ద్వారా ఇంట్లోకి అవసరమైన కూరగాయలు పండించుకోవచ్చని, ప్రకృతికి అవసరమైన పచ్చదనం పెరుగుతుందని, మొక్కలకు సేవ చేయడం ద్వారా శారీరక శ్రమతో ఆరోగ్యం మెరుగుపడుతుందని, ఇంటి వ్యర్థాలతో సహజ ఎరువులు తయారు చేయవచ్చని కలెక్టర్ వివరించారు. స్థానిక కార్పొరేటర్ లక్ష్మణరావు మాట్లాడుతూ మొక్కలను నాటడమే కాకుండా, వాటి సంరక్షణ బాధ్యతను చేపట్టాలని కోరారు. ముందుగా అక్కడ ఉన్న పార్కులో కలెక్టర్ ఇతర అధికారులు మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞలో పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య, జిల్లా పరిషత్ సీఈవో డి.సత్యనారాయణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.సాంబమూర్తి, ఈఈ పీఎస్ వీవీ ప్రసాద్, డీఈఈ శ్రీనివాసరావు, ఏసీపీలు రమణమూర్తి, హరిబాబు, మెప్మా పీడీ చిట్టిబాబు, తహసీల్దార్ కూర్మనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల బలవన్మరణం

- అనారోగ్యంతో అష్టకష్టాలు
- పిల్లలకు భారం కాకూడదని ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన సత్యనారాయణ, పార్వతి దంపతులు

విజయనగరం క్రైమ్: పిల్లలకు పెళ్లిళ్లు చేసిన ఆ వృద్ధ దంపతులు తమకొచ్చిన అనారోగ్యంతో వారికి భారం కాకూడదు అనుకున్నారు. దీంతో బలన్మరణానికి పాల్పడ్డారు. దీనికి సంబంధించిన వివరాలు విజయనగరం రూరల్ ఎస్‌ఐ అశోక్‌కుమార్ వెల్లడించారు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి వీటీ అగ్రహారానికి చెందిన కానూరి సత్యనారాయణ(60), భార్య కానూరి పార్వతి(54) వై జంక్షన్ వద్ద ఓ టిఫిన్ సెంటర్ పెట్టుకుని కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. వీరికి ఓ అబ్బాయి, అమ్మాయి ఉండగా ఇద్దరికీ పెళ్లి చేసేశారు. అబ్బాయి రమేష్‌తోనే కొన్నాళ్లుగా వై జంక్షన్‌లో టిఫిన్ దుకాణం నడుపుతున్నారు. ఇంతలోనే ఇద్దరూ అనారోగ్యం బారిన పడ్డారు. సత్యనారాయణ మానసిక వ్యాధితో, పార్వతి ఫిట్స్‌తో బాధ పడుతుండేవారు. ఈ సమస్యలు కుటుంబాన్ని కుదిపేస్తున్నాయి. ఓ వైపు ఆసుపత్రి ఖర్చులు, మరో వైపు పిల్లలపై ఆధారపడ్డాం అన్న బాధ వారిని కృంగదీసింది. ఆ బాధలను నెగ్గలేక, పోరాటం చేయలేక ఇద్దరూ పురుగుల మందు తీసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ అశోక్ కేసు నమోదు చేశారు. ఇద్దరి మృతదేహాలను సర్వజన ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

28న మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు

- హాజరు కానున్న 250 మంది క్రీడాకారులు
- ట్రోఫీలను ఆవిష్కరించిన మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ ఆంధ్ర ట్రోఫీని ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: జిల్లా వేదికగా రాష్ట్ర స్థాయి మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించటం మంచి పరిణామమని, క్రీడలకు, క్రీడాకారులకు తమ వంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. ఈ నెల 28న నగరంలోని ఆనందగజపతి కళాక్షేత్రం వేదికగా నిర్వహించ తలపెట్టిన కనకల ఎర్రయ్య మెమోరియల్ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల ట్రోఫీలను ఆయన తన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడి రామమూర్తి స్ఫూర్తితో గత 11 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న బాడీ బిల్డింగ్ పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. క్రీడలతో శారీరక, మానసిక ధృడత్వం కలుగుతుందని ప్రతి ఒక్కరు ఆ దిశగా తమ పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరయ్యే వివిధ జిల్లాల క్రీడాకారులకు మంచి ఏర్పాట్లు చేసి విజయనగరం ప్రతిష్టను చాటి చెప్పాలని ఆకాంక్షించారు. బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకల కృష్ణ మాట్లాడుతూ కనకల ఎర్రయ్య మెమోరియల్ పేరిట ఈ ఏడాది 12వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. గతేడాది నిర్వహించిన పోటీలకు 182 మంది క్రీడాకారులు హాజరు కాగా... ఈ ఏడాది సుమారు 250 మంది హాజరయ్యే అవకాశం ఉందన్నారు. దసరా, పైడితల్లమ్మ వారి ఉత్సవాల సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి రూ.1.30 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందజేయనున్నట్టు వివరించారు. ఈ పోటీల్లో క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బైక్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీ విజేతలుగా పట్టణ విద్యార్థులు



విజేతలను అభినందిస్తున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మజ్జి శశిభూషణరావు

విజయనగరం అర్బన్: తాడేపల్లిగూడెం, పత్తిపాడు ప్రాంతాల్లో ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యోగా స్పోర్ట్స్ అసోసియేషన్–2025 చాంపియన్‌షిప్‌లో విజయనగరం జిల్లా విద్యార్థులు 13 మంది పతకాలు సాధించారు. ఈ మేరకు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మజ్జి శశిభూషణరావు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వీరిలో గౌరీనాయుడు, పైడిరాజు బంగారు పతకం, గౌరీనాయుడు వెండి పతకం, జి.కిషోర్‌కుమార్ వెండి పతకం దక్కించుకున్నారు. పైడిరాజు, బార్నాల పాపని, తుపాకుల రీతూ కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు విజయవాడలో జరిగే 6వ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని జిల్లా జనరల్ సెక్రటరీ వడ్డమాని నరసింహమూర్తి తెలిపారు.

గురుదేవా సేవలు దివ్యాంగులకు వరం

- విర్ఫో ఫౌండేషన్ జీఎం టి.ప్రవీణ



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేస్తున్న విర్ఫో ఫౌండేషన్ జీఎం ప్రవీణ తదితరులు

కొత్తవలస : మండలంలోని మంగళపాలెం గ్రామం సమీపంలో గల గురుదేవా చారిటబుల్ ట్రస్టు సేవలు దివ్యాంగులకు వరం లాంటివని విర్ఫో ఫౌండేషన్ జీఎం టి.ప్రవీణ అన్నారు. విర్ఫో ఫౌండేషన్ సహకారంతో ట్రస్టు ఆధ్వర్యంలో 50 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు, చేతి కర్రలు తదితర సామగ్రిని ట్రస్టు ఆవరణలో శనివారం అందజేశారు. కార్యక్రమంలో టి.ప్రవీణ మాట్లాడుతూ మారుమూల గ్రామంలో స్థాపించబడిన గురుదేవా చారిటబుల్ ట్రస్టు సేవలు ఆరు రాష్ట్రాలకు విస్తరించాయని కొనియాడారు. వివిధ ప్రమాదాల్లో అవయవాలను కోల్పోయి జీవచ్ఛవంలా బ్రతికే క్షతగాత్రులకు కృత్రిమ అవయవాలను అమర్చి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తోందన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో ఇప్పటికే వందల మందికి కృత్రిమ అవయవాలను అందించడంలో భాగస్వామ్యం అయినట్లు పేర్కొన్నారు. అనంతరం ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు మాట్లాడుతూ దేశంలోనే అతి తక్కువ ఖర్చుతో కృత్రిమ అవయవాలను తయారు చేసి ఉచితంగా అందజేస్తున్నట్టు తెలిపారు. ఆరు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు సుమారు 2లక్షల మందికి కృత్రిమ చేతులు, కాళ్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో పలువురు ట్రస్టు సభ్యులు, విర్ఫో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వీర మహిళలను ఆపేదెవడ్రా..!



డీఎస్పీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న సీపీఐ నాయకులు, బాధితురాలు

బొబ్బిలి: సమాజంలో కులదూషణ, అణచివేతను ప్రశ్నించేందుకు వచ్చిన జనసేన పార్టీలో వీర మహిళలే కుల దూషణ కేసుపై పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసుకోవడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. జనసేన మహిళపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కావడంతోనే కాదని, వెంటనే ఆమెను అరెస్టు చేయాలని బాధితురాలు కోరుకుంటోంది. పోలీసు ఫిర్యాదును అనుసరించి జరిగిన విషయం ఏమిటంటే.. బొబ్బిలి జనసేన పార్టీలో వీర మహిళగా గత ఎనిమిదేళ్లగా పని చేస్తున్న బిగులు లక్ష్మి తనను స్థానిక పూల్‌బాగ్‌లో ఉంటున్న మరో వీరమహిళ ఎస్సీ కులం పేరుతో పలుమార్లు దూషిస్తోందని, తనకు పదవి ఇస్తే ఇటువంటి వారికి కూడా పదవులిస్తారా.. అని కులం పేరుతో దూషిస్తోందని సమాజంలో తనను అందరూ చిన్న చూపు చూస్తున్నారని ఈ నెల 13న స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అంతే కాదు మండలంలోని పారాదిలో గతంలో దేవాలయ ప్రతిష్ఠ కోసం స్థానికులు తనను ఆహ్వానిస్తే ఇటువంటి వారిని ఎవరు ఆహ్వానించారు..?తక్కువ కులానికి చెందిన వారిని ఆహ్వానిస్తే మైల పడతాం అని అందని ఫిర్యాదులో లక్ష్మి పేర్కొంది. అలాగే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని నాయకులు, కార్యకర్తలతో మాట్లాడితే అటువంటి వారితో మాట్లాడకండని అందరిలో అవహేళన చేస్తోందని బిగులు లక్ష్మి వాపోయింది. అంతేకాదు తన కులం గూర్చి దూషిస్తూ, అవమాన పరుస్తూ సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టులు పెట్టిందని చెప్పింది. ఇటీవల ఉచిత బస్సు ప్రారంభోత్సవం సమయంలో ఎమ్మెల్యే బేబీ నాయనతో తీసుకున్న ఫొటోను తెలుగు మహిళ గ్రూపులో తాను పోస్టు చేయగా దానిపైనా విమర్శలు చేసి డిలీట్ చేసిందన్నారు. ఈ స్క్రీన్ షాట్లను కూడా సమర్పిస్తున్నట్టు పోలీసులకు తెలియజేసింది బాధితురాలు. ఆమెపై చర్య తీసుకోవాలని తనకు ప్రాణహాని కూడా ఉందని ఫిర్యాదులో పేర్కొంది. కొసమెరుపేంటంటే...బాధితురాలు ప్రజా సంకల్ప వేదిక మానవ హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి.

అరెస్టు చేయాలి..

కులం పేరుతో దూషించిన మహిళను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న డిమాండ్ చేశారు. డీఎస్పీ కార్యాలయం ఎదుట బాధితురాలితో కలసి సీపీఐ నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా ఇంకా కులం పేరుతో కొన్ని వర్గాలను అణచివేసే ధోరణి ఉండటం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినప్పటికీ ఆమెను ఇంకా అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. నాయకులు రాకోటి నాగమ్మ, వై.బొబ్జీలతో పాటు బాధితురాలు బిగులు లక్ష్మి ఉన్నారు.

దర్యాప్తులో ఉంది

జనసేన పార్టీలో మహిళ తనను కులం పేరుతో దూషించిన బంటుపల్లి దివ్యపై ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. డీఎస్పీ జి.భవ్యారెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

– సతీష్ కుమార్, సీఐ, బొబ్బిలి

వాహన తనిఖీలు

పార్వతీపురం రూరల్: మండలంలోని పెదమరికి, పెదబొండపల్లి, ఎమ్మార్‌నగరం, వెంకంపేట తదితర గ్రామాల సమీపంలో ఉన్న కూడళ్ల వద్ద పార్వతీపురం రూరల్ ఎస్‌ఐ బి.సంతోషికుమారి తమ సిబ్బందితో కలసి శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా ఒడిశా ప్రాంతాల నుంచి వచ్చి పోయే వాహనాలను ఆమె సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు సారా, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నివారించేందుకు ఎప్పటికప్పుడు ఆకస్మికంగా వాహనాలను తనిఖీలు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. అలాగే ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకుండా సురక్షితంగా ప్రయాణించాలని అవగాహన కల్పించారన్నారు. వాహనాల పత్రాలను పరిశీలించారు.

డివైడర్ ఎక్కిన గ్రానైట్ లారీ



డివైడర్ ఎక్కిన లారీ

సీతంపేట: స్థానిక ఐటీడీఏ సమీపంలో కొత్తూరు–సీతంపేట రహదారి మధ్య ఉన్న డివైడర్‌పై ఓ గ్రానైట్ లారీ ఎక్కేసింది. శుక్రవారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. లారీపైన ఉన్న గ్రానైట్ రాయి కింద పడకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్టు సమాచారం. గడిగుడ్డి నుంచి సీతంపేట ఐటీడీఏ వరకు డివైడర్ పై ఉన్న సెంటర్ లైటింగ్ వెలగకపోవడం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగింది. ఒక విద్యుత్ స్తంభాన్ని కూడా బలంగా ఢీకొట్టడంతో కింద పడింది.